సాక్షి గుంటూరు

ఆదివారం, 3, ఆగస్టు, 2025



బడికి కంప్యూటర్ అందజేత

నూజెండ్ల: సీతారామపురం ఎస్పీఎస్ఎస్సీ ప్రభుత్వ పాఠశాల రిటైర్డ్ హెడ్మాస్టర్ శిష్టా సుధాకర్ జ్ఞాపకార్థం వారి కుమార్తె నాగ మణి బడికి కంప్యూటర్ బహూకరించారు.



పీడీఎస్ బియ్యం పట్టివేత

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా అధికారుల దాడులలో 45.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. రేషన్ షాపులు, రైస్ మిల్లులలో ఈ తనిఖీలు నిర్వహించారు.



చెరువులో మొసలి సంచారం

పిడుగురాళ్ల: గుత్తికొండ గ్రామ చెరువులో మొసలి సంచరించడాన్ని స్థానికులు శని వారం గుర్తించారు. వెంటనే అటవీ, రెవెన్యూ శాఖల అధికారులకు సమాచారమిచ్చారు.

న్యూస్‌రీల్

154 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



గుంటూరు వెస్ట్: పేదలకందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన దుకాణం పై సివిల్ సప్లెస్ శాఖ అధికారులు శనివారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. చుట్టు గుంట సమీపంలోని శాంతి నగర్‌లో 174 వ రేషన్ దుకాణంలో సుమారు 154 బస్తాల బియ్యాన్ని, 475 అరకేజీ చక్కెర ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. దుకాణం యజమాని దూదేకుల గాలీబుపై కేసు నమోదు చేశారు. ఈ నెల 1 నుంచి 15 వ తేదీ వరకు బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పేదలకు పంచాలి. అయితే కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటి రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేసింది. పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీని గత నెల నుంచి అమలు చేస్తోంది. ఈ విధానంలో తీవ్ర అవకతవకలు జరుగుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): నగరంలోని ఆర్. అగ్రహారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం శ్రీనివాస కల్యాణం, పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి భక్త బృందం, వామనాశ్రమ స్వామిజీ వారి ఆధ్వర్యంలో చేపట్టారు. వామనాశ్రమ స్వామీజీ మాట్లాడుతూ శ్రీనివాస కల్యాణం వల్ల వివాహ పవిత్రత, కుటుంబ విలువలు తెలుస్తాయని చెప్పారు. వేద పండితులు (తిరుపతి) శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ప్రముఖ ప్రవచనకర్త అనంతలక్ష్మీ (హైదరాబాద్) శ్రీనివాస వైభవాన్ని భక్తులకు తెలిపారు. అనంతరం స్వామిజీ భక్తులను ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందించారు. తటపర్తి రాంబాబు, నేరెళ్ల హరి, ఎల్‌ఎస్‌ఆర్.ఆంజనేయులు, మహంకాళి శ్రీనివాసరావు, బాపారావు, రఘు, జుజ్జూరు శ్రీనివాసరావు, త్రిపురమల్లు వాణి పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 7,508 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి శనివారం 7,508 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కు 316, బ్యాంక్ కెనాల్‌కు 1,807, తూర్పు కాలువకు 749, పశ్చిమ కాలువకు 283, నిజాంపట్నం కాలువకు 488, కొమ్మూరు కాలువకు 2,900 క్యూసెక్కులు విడుదల చేశారు. ఇక బ్యారేజీ నుంచి 1,89,625 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు.

దర్గాలో నిర్మాణాలు కూల్చివేత



పెదకాకాని: బాజీబాబా దర్గాలో శిథిలావస్థకు చేరిన గదుల నిర్మాణాలను వక్ఫ్‌బోర్డు అధికారులు పొక్లయిన్‌తో కూల్చివేయించారు. గత నెల 28న గుంటూరు జిల్లా పెదకాకాని బాజీబాబా దర్గాను సందర్శించిన వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ శిథిలావస్థకు చేరిన గదులు కూలితే భక్తులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ఆ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాల మేరకు దర్గా ఈఓ శనివారం షెడ్డును కూల్చివేయించారు. త్వరలో నూతనంగా గదులను నిర్మించడం జరుగుతుందని తెలిపారు.

బళ్లారి రాఘవకు నివాళి



నరసరావుపేట: తాడిపత్రి రాఘవాచార్యులు (బళ్లారి రాఘవ) జయంత్యుత్సవాలను కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. రాఘవ చిత్రపటానికి పల్నాడు జిల్లా కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సాహిత్యసేవను కొనియాడారు. డీఆర్‌ఓ ఏకా మురళి, అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రైతులపై కనికరం చూపడం లేదు. ఎన్నికల సమయంలో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత కూడా ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. అన్నదాతా సుఖీభవ నిధులను దాదాపు 20 వేల మంది రైతులకు ఎగ్గొట్టింది. ఇప్పటికే గతేడాది నిధులు ఇవ్వలేదు. ప్రస్తుతం ప్రకటించిన జాబితా ప్రకారం తమకు సాయం అందకపోవడంపై బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అన్నదాతకు మళ్లీ మొండిచేయి!

- అన్నదాతా సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందక ఆవేదన
- ఏడాదిగా ఎదురుచూసినా కనికరించని కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 19,971 మందికి రైతులకు చంద్రబాబు వెన్నుపోటు
- మోసపూరిత నైజాన్ని మరోమారు చాటుకున్న ముఖ్యమంత్రి

కొరిటిపాడు(గుంటూరు): వ్యవసాయం దండగ అనే ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో మరోమారు రైతులకు అన్యాయం జరిగింది. అన్నదాతా సుఖీభవ కింద సాయం అందక దాదాపు 20 వేల మంది రైతులు తీవ్ర వేదన చెందుతున్నారు. వాస్తవానికి అధికారంలోకి రాగానే గతేడాదే సాయం అందివ్వాలి. కానీ కూటమి నేతలు మాటలతో కాలం గడిపారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం యథావిధిగా ప్రతి ఏటా పీఎం కిసాన్ నిధులను మంజూరు చేస్తోంది. కానీ కూటమి ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ నిధులను ఇవ్వలేదు. ఎట్టకేలకు శనివారం నిధులను మంజూరు చేసింది. ఇందులో తన వాటాగా రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం వాటా పీఎం కిసాన్ నిధులు రూ.2 వేలు కలిపి ఇవ్వనుంది. మొత్తం తొలివిడతగా రూ.7 వేలు చొప్పున రైతుల ఖాతాలకు జమ కానున్నాయి.

లబ్ధిదారుల సంఖ్య తగ్గింపు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 1,26,030 మందికి రైతు భరోసా నిధులను ఏటా క్రమం తప్పకుండా ఇచ్చింది. కూటమి ప్రభుత్వం మాత్రం పలు కారణాలు సాకుగా చూపిస్తూ జిల్లాలో 19,971 మంది రైతులకు ఎగనామం పెట్టింది. జిల్లా వ్యాప్తంగా 1,06,059 మంది రైతుల ఖాతాలకు మాత్రమే నిధులను జమ చేయనుంది. దీంతో అన్నదాతా సుఖీభవ నిధులు ఎగ్గొట్టడమే కాకుండా ఏడాది తర్వాత కూడా పలువురు రైతులకు ఎగనామం పెట్టిందని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా నిధులు మంజూరు వివరాలు ఇలా..

నియోజకవర్గం	లబ్ధిదారులు
ప్రత్తిపాడు	30,354
పొన్నూరు	21,567
తెనాలి	13,316
మంగళగిరి	13,483
తాడికొండ	27,339
మొత్తం	1,06,059

జిల్లాలో రూ.13.97 కోట్లు ఎగనామం

గుంటూరు జిల్లా వ్యాప్తంగా 19,971 మంది రైతులకు రూ.13.97 కోట్లను కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టింది. వారి పేర్లు అర్హుల జాబితాలో లేవని సాకులు చెబుతోంది. 1,06,059 మంది రైతులకు సంబంధించి రూ.53.03 కోట్లు అన్నదాతా సుఖీభవ నిధులు కాగా, రూ.17.18 కోట్లు పీఎం కిసాన్ నిధులు మంజూరయ్యాయి. మొత్తంగా రూ.70.21 కోట్లను రైతులకు అందించనుంది.

పింఛన్ల మంజూరులోనూ

అదే వంచన

చంద్రబాబు అంటే మాయమాటలకు పెట్టింది పేరు. ఇక అధికారంలోకి రావడానికి ఆయన వేసే ఎత్తులు అందరికీ తెలిసినవే. ప్రభుత్వం ఏర్పాటయ్యాక కూడా ఏ పని చేసినా ప్రచార ఆర్భాటం తప్ప అసలు నిజం వేరే ఉంటుంది. ఇదే కోవలో పింఛన్ల సంఖ్య పెంచామని ఆయన చేసిన ప్రకటన కూడా చేరిపోయింది. రెండు నెలలుగా లబ్ధిదారుల సంఖ్య తగ్గించి, వారికి పింఛను ఎగ్గొట్టారు. తర్వాత నెలలో పునరుద్ధరించి, కొత్తగా ఇచ్చినట్లు చూపారు.

- రెండు నెలలుగా ఎగ్గొట్టి కొత్తగా ఈ నెల నుంచి ఇచ్చిన వైనం
- జిల్లా వ్యాప్తంగా 4,700 మందికి రెండు నెలల స్పౌజ్ పింఛను రూ.3.76 కోట్లు ఎగవేత



నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం మాటలకు చేతలకు పొంతన ఉండదని మరోసారి తేలింది. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది. ఇలా మోసపోయిన జాబితాలో తాజాగా వితంతువులు కూడా చేరారు. భర్త మరణిస్తే భార్యకు ఇవ్వాల్సిన పెన్షన్‌ను కూడా ఎగ్గొట్టిన ఘనత చంద్రబాబు సర్కార్‌కే దక్కుతుంది. జిల్లా వ్యాప్తంగా 4,700 మందికి స్పౌజ్ పెన్షన్ రెండు నెలల కింద మంజూరైనట్లు తెలిపి ఈ ఏడాది జూన్ 12వ తేదీన పెన్షన్ ఇస్తామని నమ్మబలికారు. జూలై నెలలో రెండు నెలలకు కలిపి బ్యాంకు ఖాతాలో పడతాయని మళ్లీ నమ్మించారు. అయితే అప్పటి నుంచి వారికి మాత్రం పెన్షన్ అందలేదు. తాజాగా మరోసారి పెన్షన్ ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నామంటూ మీడియా ముందు ప్రచార ఆర్భాటానికి దిగారు. అయితే అర్హులని తేలినప్పటికి 4,700 మందికి నెలకు రూ.4 వేల చొప్పున రూ.1.88 కోట్ల వంతున రెండు నెలలకు కలిపి రూ.3.76 కోట్లు ఎగ్గొట్టారు. ఇప్పుడు కొత్తగా పెన్షన్ ఇచ్చినట్లుగా ఈ నెలలో రూ.4 వేలు ఇచ్చారు. భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మహిళలకు ప్రభుత్వం తరఫున వీలైనంత త్వరగా సాయం అందించి ఆదుకోవాలి. అది పోయి ఇలా ఆలస్యం చేసి వారిని వంచించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

నాడు ఒకటో తేదీనే ఠంచనుగా..

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులుగా ఎంపికైన తరువాత ఆ వెంటనే వచ్చే ఒకటో తేదీన పెన్షన్ ఠంచనుగా అందేది. ఇందులో ఎటువంటి ఆలస్యం లేకుండా వలంటీర్, సచివాలయ వ్యవస్థలు సమన్వయంతో పనిచేసేవి. అయితే వలంటీర్ వ్యవస్థను పూర్తిగా నీరుగార్చి అంతా తామే చేసేస్తామంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ప్రభుత్వం.. లబ్ధిదారుల జీవితాలతో ఈ విధంగా ఆడుకుంటోంది. వితంతు పింఛన్ల విషయంతో తాత్సారం చేసింది. ఇతర పెన్షన్ లబ్ధిదారులకు ఎప్పుడు న్యాయం చేస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

స్టేడియంలో 'రాజకీయ' క్రీడలు

ఎన్నికల్లో రెండు వర్గాలుగా చీలిపోయిన తెలుగు తమ్ముళ్లు

క్రీడలకు పెద్దపీట వేయాల్సిన ఎన్టీఆర్ నగరపాలక సంస్థ స్టేడియం రాజకీయాలకు వేదికగా మారింది. స్టేడియం పాలకవర్గం కోసం అధికార పార్టీలోని నేతలు రెండు వర్గాలుగా చీలిపోయారు. కార్యదర్శిగా నామినేషన్లు వేసిన కొందరిని తప్పుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే హుకుం జారీ చేయడం, వారికి మిగిలిన నేతలు అండగా నిలబడటంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా మారాయి.

- ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గం కోసం పోటాపోటీ
- కార్యదర్శి అభ్యర్థులు తప్పుకోవాలని ఎమ్మెల్యే హుకుం
- ససేమిరా అంటున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజా వర్గం
- తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలంటున్న జనసేన
- పలువురు బరిలో ఉండటంతో ఉత్కంఠ రేపుతున్న ఎన్నికలు
- 59 నామినేషన్లు దాఖలు.. 2,126 మంది సభ్యులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం పాలక వర్గం ఎన్నికలకు నగరపాలక సంస్థ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి అధికార పార్టీలో లుకలుకలు బట్టబయలు అయ్యాయి. ఈ స్టేడియంపై ఆధిపత్యం కోసం నాయకులు గ్రూపులుగా చీలిపోయారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి స్టేడియం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి పదవులకు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు అయ్యాయి. మొత్తం 2,126 ఓట్లు ఉన్నాయి. 59 మంది ఎన్నికల బరిలో నిలిచారు. అధికార పార్టీ సామాజికవర్గం వారిదే మొదటి నుంచి ఈ స్టేడియంపై పెత్తనం కొనసాగుతూ వస్తోంది. సభ్యుల్లో కూడా వీరే ఎక్కువగా ఉండటం దీనికి కారణం. సుమారు ఎనిమిది వందలమందికి పైగా ఒకే సామాజిక వర్గం వారు ఉన్నారని చెబుతున్నారు. తమకే అధిపత్యం దక్కాలని ఈ వర్గం పట్టుబడుతోంది. మరోవైపు జనసేన సామాజికవర్గానికి చెందిన వారి ఓట్లు 400కు పైగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీకి చెందిన వారు కూడా బరిలోకి దిగడంతో తెలుగుదేశం పార్టీ వారికి మింగుడు పడటం లేదు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గీయుల మధ్య పోరు?

ఈ ఎన్నికలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గీయుల మధ్య జరుగుతున్న పోరులా మారిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి వర్గాలకు చెందిన వారు విడిపోయి బరిలో ఉన్నారు. ఎమ్మెల్సీ, నగర మేయర్, ప్రముఖ పారిశ్రామిక వేత్త ఒక ప్యానల్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. పోటీ నుంచి వైదొలగాలని వారికి ఎమ్మెల్యే కార్యాలయం నుంచి హుకుం జారీ చేసినట్లు చెబుతున్నారు. అయితే ఈ ప్యానల్ పోటీ నుంచి తప్పుకునేది లేదని స్పష్టం చేస్తోంది. మాజీ అధ్యక్షుడైన ఓ వ్యక్తి ఈ ఎన్టీఆర్ స్టేడియం ఖాతాలో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లను అనుమతి లేకుండా బయటకు తీసి స్టేడియం అభివృద్ధి పేరుతో ఖర్చు పెట్టినట్లు చెబుతున్నారు. దీంతో రెండో వర్గం ఈ వ్యవహారంపై నగరపాలక సంస్థలో వివరాలు సేకరిస్తున్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జోక్యం చేసుకుంటారని ఆశించినా ఆయన స్పందించకపోవడంతో ఇరు వర్గాలు ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు.

జాతీయ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్ : సదరన్ ప్రైవేటు లెక్చరర్, టీచర్ ఆర్గనైజేషన్ (ఎస్పీఎల్‌టీవో), కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారాలకు అర్హులైన ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్యుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఎంపికైన వారికి ఈనెల 31న మార్కెట్ సెంటర్‌లోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రతిభా పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తామని ఎస్పీఎల్‌టీవో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలిపారు. ఇతర వివరాల కోసం 994499 29674 79890 88274 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



విజ్ఞాన్ 13వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో అతిథులు

నైపుణ్యాలు ఉంటేనే విజయం

- ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు
- ఘనంగా విజ్ఞాన్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం
- ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం



అబ్దుల్ నజీర్ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాసరాజు, అశోక్, రామాచారి

చేబ్రోలు: విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ఒక్కటే విజయాన్ని అందించలేదని, ముఖ్యమైన జీవన నైపుణ్యాలను అలవర్చుకున్నవారే రాణించగలరని హైదరాబాద్‌లోని ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 13వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ విచ్చేశారు. వివిధ రంగాలలో కృషి చేసిన ముగ్గురికి గౌరవ డాక్టరేట్‌లను అందజేశారు. హైదరాబాద్‌లోని ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, హైదరాబాద్‌లోని జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్, లిటిల్ మ్యూజిసియన్స్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ కొమండూరి రామాచారిలకు ఈ గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మొత్తం 2,122 మంది విద్యార్థులకు డిగ్రీలు, 60 మందికి బంగారు పతకాలను అందజేశారు.

విద్యార్థులకు సూచనలు

గౌరవ డాక్టరేట్ అందుకున్న చింతలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ... మంచి అలవాట్లు, చక్కని ప్రణాళిక విజయానికి ఎంతో కీలకమన్నారు. విద్యార్థి దశలోనే అమలు చేయాలని సూచించారు. చదువులో పరిజ్ఞానంతోపాటు విశ్వ నైపుణ్యాలను సొంతం చేసుకున్నవారు వృత్తి జీవితంలో రాణించగలరన్నారు. ఏఐ టూల్స్‌పై పట్టు సాధించాలని సూచించారు. హైదరాబాద్‌లోని జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి మాట్లాడుతూ సామాజిక అసమానత వంటి అనేక సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటోందన్నారు. వాటిని వినూత్నంగా పరిష్కరించడం యువత బాధ్యత అన్నారు. ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్, లిటిల్ మ్యూజిసియన్స్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ కొమండూరి రామాచారి మాట్లాడుతూ డాక్టరేట్ ప్రతిభకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నట్లు తెలిపారు. యువత కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు.

శాంతి మంత్రం ప్రగతికి కీలకం

విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడ చూసినా కలహాలు కనిపిస్తున్నట్లు పేర్కొన్నారు. మన మధ్య మళ్లీ ఒక గాంధీ, ఒక బుద్ధుడు పుడితే ఎంత మంచిదో అనిపిస్తోందన్నారు. శాంతే మన అభివృద్ధికి మూలస్తంభమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. కొత్త ఆవిష్కరణలు, అవి కూడా సమాజానికి అందుబాటులో ఉండేలా చేయడం విద్యార్థుల బాధ్యత అన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మేకిన్ ఇండియా మాత్రమే కాదు – ఇన్వెంట్ ఇన్ ఇండియా, డిజైన్ ఇన్ ఇండియా, లీడ్ ఫ్రమ్ ఇండియా కూడా కావాలని పిలుపునిచ్చారు. విభిన్న రంగాలలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై, విజ్ఞానాన్ని వ్యవస్థగా మారుస్తూ ఆలోచనలను ప్రభావవంతంగా మలచడంపై దేశాభివృద్ధి ఆధారపడి ఉందన్నారు.



స్నాతకోత్సవంలో డిగ్రీలు పొందిన విద్యార్థుల కేరింతలు

విద్యార్థుల కేరింతలు

డిగ్రీలు పొందిన వేళ విద్యార్థుల సంబరం అంబరాన్ని అంటింది. కేరింతలతో ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. నాలుగేళ్ల తమ అనుభవాలను వారు పంచుకున్నారు. తరగతి గదుల్లో గడిపిన క్షణాలను నెమరువేసుకున్నారు. గుర్తుగా సెల్ఫీలు దిగారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే వేషధారణలో వచ్చారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ , సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు, అధిపతులు, స్నాతకోత్సవ కన్వీనర్లు సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. తొలుత రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం తెలిపారు.

తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన బళ్లారి

నగరంపాలెం(గుంటూరువెస్ట్): తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి బళ్లారి రాఘవ అని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శనివారం బళ్లారి రాఘవ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సతీష్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి కొత్త ఒరవడిని తీసుకొచ్చిన ప్రఖ్యాత సాహితీవేత్త, నాటకకారుడు అని అన్నారు. ఆయన రచించిన రఘునందన, హరిశ్చంద్ర, ద్రౌపది వంటి క్లాసిక్ నాటకాలకు నాటకరంగంలో చరిత్రాత్మక స్థానం దక్కాయని చెప్పారు. తెలుగు నాటక రంగానికి నూతన శైలిని పరిచయం చేశారని పేర్కొన్నారు. నాటక ప్రదర్శనల్లోని పాత్రల్లో జీవం పోసే మేటి నటుడిగా పేరు గడించారని అన్నారు. కార్యక్రమంలో ఏఎ అద్దంకి వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు శంకరరావు, సుభాషిణి, ఎంటీ ఆర్ఐ శ్రీహరిరెడ్డి పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బళ్లారి రాఘవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

న్యాయమైన హక్కులను కాపాడాలి

ఫ్యాప్టో జిల్లా చైర్మన్ నరసింహారావు

గుంటూరు వెస్ట్: ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె.నరసింహారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల, పెన్షనర్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుంచి విముక్తి కలిగించాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సీపీఎస్ రద్దు, మున్సిపల్ ఉపాధ్యాయుల జీపీఎఫ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టడంతోపాటు ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని తెలిపారు. 18 రకాల డిమాండ్ల సాధన కోసం ధర్నా నిర్వహిస్తున్నామని నరసింహారావు తెలిపారు. అనంతరం డీఆర్వో షేక్ ఖాజావలికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరాంజనేయులు, కో-చైర్మన్ బి.సత్యం, రాజశేఖర్, జి.వేళాంగిణి, తిరుమలేష్, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

డిగ్రీ ప్రవేశాలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉన్నత విద్యాశాఖాధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ ప్రవేశాలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉన్నత విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లవరపు పవన్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నప్పటికీ, గత ప్రభుత్వాలపై విమర్శలకే పరిమితమై, తాము చేయవలసిన బాధ్యతల్ని నిర్లక్ష్యంగా వదిలేసిందని విమర్శించారు. ఇంటర్మీడియెట్ ఫలితాలు వచ్చిన నాలుగు నెలలు దాటినా, ఇంకా డిగ్రీ ప్రవేశాలకు ప్రకటన ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. విద్యార్థులు ప్రవేశాలు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయా, ఆన్‌లైన్‌లో జరుగుతాయా, అనే అయోమయంలో ఉన్నారని తెలిపారు. ఉన్నత విద్యా మండలి, ఉన్నత విద్యాశాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, ప్రవేశ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలన్నారు.

వృద్ధుడిపై పోక్సో కేసు

మంగళగిరి: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వృద్ధుడిపై శనివారం పోక్సో కేసు నమోదు చేశారు. మంగళగిరి బాపనయ్య నగర్‌లోని ఓ మైనర్ బాలికపై 70 సంవత్సరాల వృద్ధుడు అంకాలు అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక తల్లి శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశారు.

గ్రామీణ విలేకరుల పునశ్చరణ తరగతులు ప్రారంభం

తెనాలి: సీఆర్ మీడియా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే), తెనాలి నియోజకవర్గ శాఖ సహకారంతో జిల్లాలోని గ్రామీణ విలేకరులకు రెండురోజుల పునశ్చరణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన తరగతులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సభకు సీఆర్ మీడియా చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. జర్నలిజం వృత్తికి సమాజంలో గౌరవం తగ్గాయనీ, అందుకు కారణాలను సురేష్‌కుమార్ వివరించారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

పాఠశాలల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించిన ఉత్తర్వులు దహనం చేసిన ఏఐఎస్ఎఫ్



లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం శుక్రవారం విడుదలచేసిన ఉత్తర్వులను అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ తీవ్రంగా ఖండించారు. గుంటూరు కొత్తపేట భగత్ సింగ్ విగ్రహం సర్కిల్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఉత్తర్వులు విద్యార్థి హక్కులపై దాడిగా భావిస్తూ, తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ముగ్గురిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

పొన్నూరు: ఆర్థిక లావాదేవీల విషయంలో ఏర్పడిన వివాదంలో ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పలు సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు పొన్నూరు పట్టణ ఎస్ఐ శ్రీహరి తెలిపారు. మునిపల్లె గ్రామానికి చెందిన గొడ్డేటి శ్యాంకుమార్‌కు వట్టికూటి సత్య సాయిబాబు, వట్టికూటి వెంకట రామానాయుడు, గుత్తికొండ రాజేష్‌లకు ధాన్యానికి సంబంధించిన సుమారు రూ.40 లక్షల బాకీ విషయంలో వివాదం నెలకొంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని నేపథ్యంలో శ్యాంకుమార్ జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఏడాది మే 8వ తేదీన ఆ ఫిర్యాదు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు రావడంతో పోలీసుస్టేషన్ ఎదుట ఇరువర్గాలు మాట్లాడుకునే క్రమంలో వాగ్వాదం జరిగింది. తనను కులం పేరుతో దూషించారని శ్యాంకుమార్ ఫిర్యాదు చేశాడు. స్టేషన్ బయట రోడ్డుపై జరగడంతో శ్యాంకుమార్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలి

- మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోన
- వీఐటీ ఏపీ వర్సిటీలో ఘనంగా 8వ విశ్వవిద్యాలయ దినోత్సవం



వార్షిక ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న అతిథులు

తాడికొండ: విద్యార్థులు లక్ష్యాలను పెట్టుకొని జీవితంలో ముందుకు నడవాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ అన్నారు. తుళ్లూరు మండలం ఐనవోలులోని వీఐటీ, ఏపీ విశ్వవిద్యాలయంలో 8వ విశ్వవిద్యాలయ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోన శశిధర్, గౌరవ అతిథిగా నెక్స్‌జెన్ టాలెంట్, విప్రో లిమిటెడ్ గ్రూప్ హెడ్ తిరునావుక్కరసు పళనియప్పన్ హాజరయ్యారు. శశిధర్ మాట్లాడుతూ అకాడమిక్, రీసెర్చ్ రంగాలలో బహుమతులు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. తిరునావుక్కరసు మాట్లాడుతూ వీఐటీతో విప్రోకు ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉందని, విద్యార్థులు, ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధికి విప్రో కట్టుబడి ఉందన్నారు. వీఐటీ వ్యవస్థాపకుడు, చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో అత్యుత్తమ, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విద్యను అందిస్తున్నామన్నారు. కోన శశిధర్, తిరునావుక్కరసు పళనియప్పన్, చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ చేతులమీదుగా విశ్వవిద్యాలయ వార్షిక నివేదిక ఆవిష్కరించారు. 249 అకాడమిక్ అవార్డులు, 10 ఎండోమెంట్ అవార్డులు, 260 అధ్యాపక రీసెర్చ్ అవార్డులు, 177 రీసెర్చ్ స్కాలర్స్ అవార్డులు అందించారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన 30 మంది అధ్యాపకులు, ఏడుగురు సిబ్బందిని సత్కరించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వి.కోటారెడ్డి విశ్వవిద్యాలయ ప్రగతిని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించా రు. వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, డిప్యూటీ డైరెక్టర్ (స్టూడెంట్ వెల్ఫేర్) డాక్టర్ ఖాదీర్ పాషా పాల్గొన్నారు.